క్లుప్తంగా

రేపు షిర్డీ సాయి దివ్యచరితం నృత్య రూపకం ప్రదర్శన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నాట్యాచారిణి ఎస్వీ శివకుమారి బృందంచే శ్రీ షిర్డీ సాయి దివ్యచరితం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన నిర్వహిస్తున్నామని కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీ సాయి బాబా షిర్డీ గ్రామంలో ప్రవేశించడం, ద్వారకామాయి(మసీదు)లో స్థిరపడటం, భక్తులను ఆపద సమయాల్లో ఆదుకోవడం, వ్యాధిగ్రస్తుల జబ్బులను నయం చేయడం, తన భక్తుడైన తాత్యా ప్రాణాలను కాపాడుకోడానికి తన ప్రాణాలను పణంగా పెట్టి సమాధి అవ్వడం అంశాలను నృత్య రూపకంలో ప్రదర్శిస్తారని తెలిపారు. భక్తులు ఉచితంగానే ఈ ప్రదర్శనను తిలకించవచ్చునని పేర్కొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): దీపావళి సందర్భంగా నగరంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు దీపావళి బాణసంచా విక్రయించుకునేందుకు విద్యాధరపురం లేబర్ కాలనీలో స్టేడియంలో, అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో వీఎంసీ స్టాళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లో విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు విక్రయదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఎంసీ ఎస్టేట్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మధ్యాహ్నం రెండు గంటల వరకు సత్యనారాయణపురం ఏకేటీపీ స్కూల్ వద్ద ఉన్న సర్కిల్–2 కార్యాలయంలో దరఖాస్తులను విక్రయిస్తున్నామన్నారు. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తర్వాత దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ద్వారా స్టాల్స్ కేటాయిస్తామని తెలిపారు.

జ్యోత్స్న ఆశయాలను కొనసాగిద్దాం



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్త్రీ, పురుష సమానత్వం కోసం సేఫ్ సంస్థ వ్యవస్థాపకురాలు జ్యోత్స్న ఎంతో కృషి చేశారని, ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించారని, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో తరుణీ తరంగాలు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, ఎస్ఎఫ్‌డబ్ల్యు, పీఓడబ్ల్యూ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్, స్ఫూర్తి ఆర్గనైజేషన్, భారత మహిళామండలి, నిర్భయ క్రాంతి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జ్యోత్స్న జ్ఞాపకల పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి, అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్.కొండలరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు మాట్లాడుతూ.. జ్యోత్స్న మన మధ్య లేకపోయినా ఆమె సేవలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. తరుణీ తరంగాలు అధ్యక్షురాలు రావి శారద, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, వివిధ మహిళా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామివారి ఆలయం ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అలంకరణ జరిగాయి. మల్లేశ్వరాలయ ఆవరణలో దక్షిణామూర్తికి తొలుత పంచామృతాలతో అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించిన అర్చకులు వారికి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

2 నుంచి కార్తిక మాసోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట వీరాంజనేయ స్వామివారి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి సన్నిధిలో నవంబర్ 2వ తేదీ నుంచి కార్తిక మాసోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. కార్తిక మాసం తొలి రోజైన శనివారం స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించడంతో పాటు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపం వెలిగిస్తామన్నారు. స్వామివారికి మహాన్యాస రుద్రాభిషేకాలు, నాలుగు సోమవారాలు విశేష అభిషేకాలు, కార్తిక పౌర్ణమి పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



గోతులమయంగా వీఎంసీ కల్యాణ మండపం వెనుక రోడ్డు



కాలనీలో రహదారి దుస్థితి

- హెచ్‌బీ కాలనీ న్యూ హెచ్‌బీజీలో రోడ్లపై నడవలేని స్థితి
- అడుగడుగునా గోతులు
- రోడ్లు నిర్మించాలని స్థానికుల వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం హౌసింగ్ బోర్డు న్యూ హెచ్‌బీజీలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దశాబ్దాల నాడు వేసిన తారు రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు, వరదలకు రోడ్ల స్వరూపమే మారిపోయింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. రాళ్లు మొనతేలాయి. కొద్దిపాటి వర్షానికి గుంతల్లో నీరు నిలిచి బురద కయ్యాలుగా మారుతున్నాయి. న్యూ హెచ్‌బీజీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుడుతున్నారు.

మరమ్మతుల పేరుతో తవ్వకాలు..

న్యూ హెచ్‌బీజీలో ఎల్‌ఐసీ రోడ్డులో 9 అడ్డరోడ్లు ఉన్నాయి. ఒకటి అర మినహా అన్ని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్ద పెద్ద గోతులు పడి వాహనాలు ఉయ్యాలలూగుతున్నాయి. ఇక బైక్‌పై వెళ్లే వాళ్ల పరిస్థితి మరి ఇబ్బందికరంగా ఉంది. నడవాలంటే నరక యాతన పడాల్సి వస్తోంది. వీఎంసీ కల్యాణ మండపం రోడ్డులో ఏర్పడిన గోతుల్లోకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. దీనికి తోడు పక్కనే హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలం ఖాళీగా ఉండడంతో వాహనాలన్నీ అక్కడే పార్క్ చేస్తున్నారు. హెవీ లోడ్‌తో వాహనాలు రావడంతో పాత రోడ్లు కుంగిపోతున్నాయి. దీనికి తోడు కార్పొరేషన్ పైపులైన్లు ఏర్పాటు, డ్రెయినేజీల మరమ్మతుల పేరుతో రోడ్లను తవ్వారు. ఆ తర్వాత వాటికి ప్యాచ్ వర్క్ కూడా చేయలేదు. దీంతో తవ్విన ప్రదేశంలో తారు లేచి అక్కడ గోతులు మరింత పెద్దవి అయ్యాయి.

వర్షం పడితే వణుకు..

వీఎంసీ కల్యాణ మండపం రోడ్డులో నివసించేవారు రాత్రి వేళల్లో ఆ రోడ్లలో ఇబ్బందులు పడలేక చుట్టూ తిరిగి వస్తున్నారు. వీఎంసీ ఖాళీ స్థలం పక్కన రోడ్డు తారు వేయకుండా వదిలివేశారు. ఆ ప్రదేశంలో చెత్త వేస్తున్నారు. సిల్ట్ రోడ్డపై వేయడంతో మట్టి దిబ్బలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డులో పరిస్థితి అధ్వానంగా తయారైంది. పోలీసు స్టేషన్, ఎల్‌ఐసీ స్టాఫ్ క్వార్టర్స్ మధ్య రోడ్డులో తారు లేచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. క్వార్టర్స్‌కు ఆనుకుని ఉన్న రోడ్డులో చెత్త వేస్తున్నారు. మామూలు రోజుల్లో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం వచ్చిందంటే క్వార్టర్స్‌లో నివసించే వారు వణికి పోతున్నారు. ఆ రోడ్డు తటాకాన్ని తలపిస్తోంది. మెయిన్ రోడ్డు కంటే ఎత్తు తక్కువలో ఉండడంతో వరద నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. నీరు నిల్వ ఉండి తారు పూర్తిగా లేచిపోయింది. ఈ రోడ్లు అన్నీ కచ్చా రోడ్లను తలపిస్తున్నాయి.

రహదారులు నిర్మించాలి..



హెచ్‌బీ కాలనీ న్యూ హెచ్‌బీజీలో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వరదలు వచ్చినప్పుడు వరద పూర్తిగా తగ్గిన ఈ రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో నూతన రహదారులు నిర్మించాలి.

– కృష్ణప్రసాద్, స్థానికుడు, హెచ్‌బీజీ

ప్రతిపాదనలు పంపాం..



న్యూ హెచ్‌బీజీలోని వీఎంసీ కల్యాణ మండపం వద్ద అడ్డ రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. వాటర్ లైన్లు, డ్రెయినేజీ మరమ్మతులకు తవ్విన చోట గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్లు నిర్మించాలని కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించాం. కౌన్సిల్‌లో ఆమోదం పొందింది.

– బి.కోటిరెడ్డి, కార్పొరేటర్

నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా తీసుకోవల్సిన ముందస్తు జాగ్రత్తలపై గొల్లపూడి, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు భవానీపురం పోలీసులు గురువారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైమ్ ఏడీసీపీ ఎం.రాజారావు మాట్లాడుతూ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఊరు వెళ్లే సమయంలో తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా వారు ఏర్పాటు చేసే ఎల్‌హెచ్‌ఎమ్ఎస్‌ను ఉపయోగించుకోవాలన్నారు. దీని వలన దొంగ ఇంట్లోకి ప్రవేశిస్తే వెంటనే అలారం మోగడంతో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కుకూడా తెలియడం ద్వారా దొంగను పట్టుకోవచ్చని చెప్పారు. సైబర్ క్రైమ్ బారిన పడిన బాధితులు 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. సైబర్ సిటిజన్ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, భవానీపురం పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి



ట్రాఫిక్ సమస్యపై చర్చిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్న

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ, పోలీస్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతోనే నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం సాధ్యమవుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో విజయవాడ కమిషనరేట్ ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్న ఆధ్వర్యంలో ఆయన బృందం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను గురువారం కలిసి ట్రాఫిక్ అవరోధాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నగరంలోని కృష్ణలంక, గవర్నర్‌పేట, గాంధీనగర్, పటమటలో రహదారుల ఆక్రమణలు పెరిగాయని, వీటిని నిరోధించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు రామవరప్పాడు రింగ్ వద్ద ఫుట్‌పాత్ నిడివితగ్గించి రోడ్డు వెడల్పు చేయాలని, బెంజిసర్కిల్ వద్ద మార్గ్ కృష్ణయ్య హోటల్ వద్ద ఉన్న డివైడర్ కటింగ్ ఎన్టీయార్ సర్కిల్ వైపునకు మార్చాలని ప్రతిపాదించారు. కనకదుర్గ వారధి వద్ద ఉన్న ఐలాండ్స్ నిడివి తగ్గించటం, బెంజిసర్కిల్ వద్ద ప్రస్తుతం ఉన్న ఫ్రీలెఫ్ట్(ఏలూరు రోడ్డు వైపునకు వెళ్లే వాహనాలకు) సరీస్ రోడ్డులోకి మార్చాలని, ట్రాఫిక్ సిబ్బందికి కొత్త క్యాబిన్‌లు ఏర్పాటు చేయాలని ఏడీసీపీ వీఎంసీ కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన సిబ్బందితో తాను క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్సైలు, వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు మంజూరు చేయాలి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సునీత లక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హులైన స్వయం సహాయక సంఘ సభ్యుల(ఎస్‌హెచ్‌జీ)కు లఖ్‌పతి దీదీ రుణాలను మంజూరు చేయాలని డీఆర్డీఏ డీపీఎం సునీత లక్ష్మి ఆదేశించారు. ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఎస్‌హెచ్‌జీ, లఖ్‌పతి దీదీ మాన్సూన్ క్యాంపెయిన్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఇండియన్ బ్యాంక్ గ్రామీణ బ్యాంకింగ్ విభాగం జనరల్ మేనేజర్ వీ చంద్రశేఖరన్, ఫీల్డ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్) జీ రాజేశ్వరరెడ్డి, అమరావతి జోనల్ మేనేజర్ డీ సూర్యనారాయణ మూర్తి, విజయవాడ జోనల్ మేనేజర్ ఎం రాజేష్‌లతో కలిసి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రుణాలకు సంబంధించి స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.330 కోట్ల మేరకు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఎంఎం పాడు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్ రామమూర్తి, అమరావతి డెప్యూటీ జోనల్ మేనేజర్ కె.కృష్ణమోహన్, విజయవాడ డెప్యూటీ జోనల్ మేనేజర్ దాసరి రామారావు, విజయవాడ మైక్రోసెట్ బ్రాంచి మేనేజర్ బి.నాగు, విజయవాడ జోనల్ కార్యాలయ బృందం, విజయవాడ జోన్ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

టాటా మోటార్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్ ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాహనాల తయారీలో అగ్రగామిగా ప్రసిద్ధి చెందిన టాటా మోటార్స్, స్థానిక డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో 'దేశ్ కా ట్రక్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవీ ఈశ్వరరావు, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమోతు రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలను పొందుతున్న టాటా హెవీ కమర్షియల్ వాహనాలు రానున్న రోజుల్లో మరింత చేరువగా వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతికత కలిగిన ట్రక్స్, టిప్పర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో టాటా మోటార్స్ ఏరియా మేనేజర్ ఎస్.భరణిధరన్, టెరిటరీ సేల్స్ మేనేజర్ ప్రసాద్, స్టేట్ సర్వీస్ హెడ్ ఎల్.రాజేంద్ర ప్రసాద్, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పీబీ సత్యనారాయణరావు, టాటా కంపెనీ ప్రతినిధులు, కస్టమర్స్, ఫైనాన్షియర్స్ తదితరులు పాల్గొన్నారు.

పాలియో రహిత సమాజం అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పోలియో రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, రోటరాక్ట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ పతంజలిశాస్త్రి మాట్లాడుతూ పోలియో నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అనేక సామాజిక సేవా సంస్థలు పలు ఏళ్లగా విస్తృతమైన కృషిని కొనసాగిస్తున్నాయన్నారు. విద్యార్థులు సైతం ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ పోలియోను పూర్తిగా నిర్మూలించేందుకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్లు డాక్టర్ నరేష్, డాక్టర్ ఏ రమాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్‌కు పలు పురస్కారాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రెప్కో బ్యాంక్ సహకార బ్యాంకింగ్ అవార్డ్స్ – 2024లో పలు అవార్డులను సాధించిందని ఆ బ్యాంక్ వన్‌టౌన్ శాఖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.పవన్‌చంద్ర తెలిపారు. లక్నోలో జరిగిన సహకార బ్యాంకింగ్ అవార్డుల్లో ఉత్తమ రిస్క్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, ఉత్తమ కేవైసీ నిర్వహణ రంగంలో రెండు అవార్డులు లభించాయని పేర్కొన్నారు. విజయవాడలోని రెండు శాఖల్లో అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని తెలిపారు. డిపాజిట్లపై సీనియర్ సిటిజెన్స్‌కు అత్యధికంగా 8.25 శాతం, ఇతరులకు 7.75 శాతం వడ్డీని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి తనఖాపై త్వరతగతిన రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నామని చెప్పారు.

ధర్మపథం వేదికపై భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథం వేదికపై గురువారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన అన్నమయ్య స్వర అకాడమీకి చెందిన కళాకారులు ఆలపించిన భక్తిరంజని భక్తులను ఆకట్టుకుంది. గురువారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై సుజని బృందం పలు కీర్తనలను లయబద్ధంగా ఆలపించారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు కళావేదికపై జరుగుతున్న సాంస్కృతిక ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. కళాబృందంలోని కళాకారులను అభినందించారు. అనంతరం కళాబృందంలోని కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రగతి సాధించాలి



వైద్య శాఖాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ శుభమ్ నొక్వాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రగతి సాధించి, లక్ష్యాలు చేరుకోవాలని ట్రైనీ కలెక్టర్ శుభమ్ నొక్వాల్ ఆదేశించారు. ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖలోని వివిధ విభాగాల పని విధానం, కార్యక్రమాల అమలు, లక్ష్యాలు, ప్రగతి వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆరోగ్య కార్యక్రమాలు జిల్లాలో అమలవుతున్న తీరును ఆయనకు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీ నాయుడు, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై డీఎంహెచ్ఓ సమీక్ష

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులతో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టడంలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధిగా సర్వైలెన్స్ నిర్వహణ, ఎక్కడైనా డయేరియా, జ్వరం కేసులు నమోదైనా ఆ ప్రాంతంలో వెంటనే నివారణ చర్యలు చేపట్టడం, రాపిడ్ రెస్పాన్స్ బృందాలు 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'క' చిత్రం ట్రైలర్ విడుదల



మీడియాతో మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం, చిత్ర యూనిట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో 'క' చిత్రం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కోలాహలంగా సాగింది. గాంధీనగర్‌లోని రాజ్ – యువరాజ్ థియేటర్‌లో హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రం ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ గురువారం జరిగింది. హీరో కిరణ్ అబ్బవరం హీరోయిన్ నయన్ సారిక, దర్శకుడు సుజిత్, నిర్మాత చింత గోపాలకృష్ణరెడ్డితో కలిసి ట్రైలర్‌ను లాంఛనంగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషలలో 'క' చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. 1970 బ్యాక్ డ్రాప్‌లో జరిగిన ఒక కథ ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకద్వయం సుజిత్, సందీప్ అద్భుతంగా తెరకెక్కించారన్నారు. నయన్ సారిక మాట్లాడుతూ తెలుగులో తాను నటిస్తున్న మొదటి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

వరద బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం



వరద సాయం అందని జాబితా ప్రదర్శిస్తున్న సత్యబాబు తదితరులు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇటీవల నగరంలో బుడమేరు వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని 50వ డివిజన్ సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో గురువారం సీపీఎం నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరదలు వచ్చి 54 రోజులు గడిచినా ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా బాధితులకు సాయం అందించలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాయం అందని 40 శాతానికి పైగా బాధితులు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే వాటిని బుట్టదాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం సమాధానం చెప్పడంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వరద బాదితుల సాయం విషయంలో ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలకు.. చేతలకు పొంతన లేదని విమర్శించారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సీపీఎం పశ్చిమ సిటీ సభ్యులు సూరిబాబు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని, ఆధునిక సాంకేతికతపై పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సీనియర్ ఎంబెడెడ్, ఐఓటీ డెవలపర్ సి.సుధాకరరెడ్డి అన్నారు. నగర సమీపంలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విత్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగిన వర్క్‌షాపులో సుధాకరరెడ్డి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. బీటెక్‌లో సీఎస్సీ చదువుతున్న వారు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ఐఓటీ, ఏఐలో లోతైన పరిజ్ఞానం, అనుభవం విద్యార్థులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికల సూత్రాలు, ఆచరణాత్మక వినియోగాలను తెలుసుకోవాలని సూచించారు. నిమ్రా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్‌ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకుల సంపూర్ణ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాపు కన్వీనర్ డాక్టర్ సయ్యద్ గులాం గౌస్, డాక్టర్ సయ్యద్‌సాదత్ ఆలీ, ఎం.హర్షిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న సంగీతోత్సవాలు



శతావధాని మురళి

విజయవాడకల్చరల్: కృష్ణమాచార్యులు కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాన్‌మణి శ్రీమాన్ ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శత జయంతి సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు వాగ్గేయకార కృతులను ఆలపిస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమాలు పత్రి అన్నపూర్ణ కచేరీతో ప్రారంభమయ్యాయి. ఎస్.వనమాలి, ఎస్.మాధవ్ వేణుగానంతో అలరించారు. డాక్టర్ వేమూరి ఓజస్వి, పాల్ఘాట్ రాఘవ కృష్ణ, ముట్నూరి జలజాక్షి, ఎంఎస్ మూర్తి, పారుపల్లి సృజన తదితరులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శతావధాని అవధానుల మురళి కృష్ణమాచార్యులు సాహితీ వైభవం అంశంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణమాచార్యులు బహుముఖ ప్రతిభాశాలిగా అభివర్ణించారు. సంగీత రంగంలో విశేష ప్రతిభ కనబర్చారన్నారు. వీరి సంగీత సేవలను గుర్తించి అనేక సంస్థలు ఘనంగా సత్కరించాయని తెలిపారు. తెలుగు, సంస్కృతంలోనూ రచనలు చేశారని కృష్ణమాచార్యులు సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని అమెరికన్ అంకాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ అనీలా పాటిబండ్ల అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్, అమెరికన్ అంకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో అంబాపురం గ్రామంలో రొమ్ము క్యాన్సర్‌పై స్థానిక మహిళలకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనీలా పాటిబండ్ల మాట్లాడుతూ మారుతున్న జీవన శైలితో పాటుగా కొన్ని జన్యుపరమైన అంశాల కారణంగా చాలా వరకూ క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయన్నారు. క్యాన్సర్‌ను ముందుకు గుర్తించినట్లయితే చక్కని వైద్యంతో దానిని నివారించేందుకు అవకాశముంటుందన్నారు. రొమ్ము క్యాన్సర్ రావడానికి కారణాలు, చేయించుకోవాల్సిన పరీక్షలు తదితర అంశాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.